ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
గురువారం 21 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 2 pm

కాగ్ అధిపతిగా సంజయ్ మూర్తి

# ప్రమాణం

ప్రమాణం చేయించిన రాష్ట్రపతి ముర్ము

తెలుగు వ్యక్తికి దక్కిన అరుదైన ఘనత



న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక భారత కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కొండ్రు సంజయ్‌మూర్తి చేపట్టారు. కాగ్ అధిపతిగా గురువారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆయన చేత ప్రమాణం చేయించారు. ఈ పదవి చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్‌మూర్తి అరుదైన ఘనత సాధించారు. అమలాపురం మాజీ ఎంపీ కేఎస్ఆర్ మూర్తి కుమారుడు సంజయ్‌మూర్తి. 1964 డిసెంబరు 24న జన్మించిన ఆయన.. మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ చదివారు. 1989లో ఐఏఎస్ అధికారిగా హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు ఎంపికై ఆ తర్వాత కేంద్ర సర్వీసుల్లో పనిచేశారు. 2021 సెప్టెంబరు నుంచి జాతీయ ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేస్తూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం అమలులో క్రియాశీలక పాత్ర పోషించారు.

భవనం మీద నుంచి దూకి

# సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సూసైడ్

హైటెక్ సిటీలో ఘటన

కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

హైదరాబాద్: భవనం మీద నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన హైటెక్ సిటీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వంగ నవీన్ రెడ్డి (24) ఎన్సీఆర్ యోయిస్ కంపెనీలో పనిచేస్తున్నట్లు తెలుస్తున్నది. మైండ్ స్పేస్ టవర్‌లో 13వ ఫ్లోర్ నుంచి దూకాడు. తలకు తీవ్రగాయాలవడంతో చనిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దవాఖానకు తరలించారు. అతని మృతికిగల కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన మాదాపూర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# తరతరాలకు మేలు

## మూసీ ప్రక్షాళన చేయాలని ప్రజాప్రభుత్వం సంకల్పం

ప్రపంచ స్థాయి ప్రమాణాలతో హైదరాబాద్ అభివృద్ధి

నదులను కబళిస్తే మనిషి మనుగడ ప్రశ్నార్థకం

ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : నదుల వెంట నాగరికత వర్ధిల్లా లన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎక్స్ వేదికగా ఆయన పోస్టు చేశారు. నదులను కబళిస్తే మనిషి మనుగడే ప్రశ్నార్థకమవుతుందన్నారు. ప్రజా ఆరోగ్యం .. పటిష్ఠ ఆర్థికం.. పర్యావరణ కోణాల్లో.. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందాల్సిన హైదరాబాద్ కు మూసీ ఒక వరం కావాలి అని అన్నారు. కానీ, శాపంగా మిగిలి పోకూడదని తెలిపారు. మూసీ ప్రక్షాళన చేయాలన్న ప్రజా ప్రభుత్వ సంకల్పం .. ఈ తరానికే కాదు.. తరతరాలకు మేలు చేసే నిర్ణయం అని వెల్లడించారు. ఈ నిర్ణయానికి అండగా నిలిచే ప్రతీ వ్యక్తికి ప్రతీ వ్యవస్థకి ధన్యవాదాలు అని తెలిపారు.



# మర్యాద పూర్వక కలయిక

జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బీ.ఆర్.నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన సీఎంకు టీటీడీ తరఫున జ్ఞాపికను బహూకరించారు (హైదరాబాద్)



# 9 నుంచి గ్రూప్ 2 హాల్ టికెట్లు

వెబ్ సైట్ లో డౌన్‌లోడ్ ..

5.51 మంది అభ్యర్థులు దరఖాస్తు

హైదరాబాద్: గ్రూప్2 పరీక్షలకు సంబంధించి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ అప్డేట్ ఇచ్చింది. డిసెంబర్ 9 నుంచి పరీక్ష జరిగే రోజు వరకు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. డిసెంబరు 15, 16వ తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. మొత్తం 783 గ్రూప్ 2 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 7, 8 తేదీల్లో పరీక్షలు నిర్వహించాల్సి ఉంది. కానీ డీఎస్సీ, గ్రూప్2 మధ్య వారం రోజులు మాత్రమే వ్యవధి ఉండటంతో పరీక్షలను వాయిదా వేయాలని నిరుద్యోగులు ఆందోళన నిర్వహించారు. ఆందోళనల నేపథ్యంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గ్రూప్2 పరీక్షను వాయిదా వేసి డీఎస్సీని మాత్రం వాయిదా వేయలేదు. యథాతథంగా నిర్వహించారు. ఎంపికైనవారికి నియామక పత్రాలు కూడా అందించారు. ఇక గ్రూప్ 2 ఉద్యోగాలకు 5.51లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.




మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాల ఫుడ్ పాయిజన్ ఘటన

# ముగ్గురిపై వేటు



ఎంఈఓ, హెడ్ మాస్టర్, భోజన నిర్వహణ ఇన్ చార్జీల సస్పెండ్

మధ్యాహ్న భోజన ఏజెన్సీ రద్దు చేస్తూ ఉత్తర్వులు

నారాయణపేట : మాగనూరు జిల్లా పరిషత్ పాఠశాల ఫుడ్ పాయిజన్ ఘటనపై అధికారులు సీరియస్ అయ్యారు. ఆ మేరకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఎంఈఓ, హెడ్ మాస్టర్, భోజన నిర్వహణ ఇన్ చార్జిపై వేటు పడింది. మధ్యాహ్న భోజన సరఫరా చేసే ఏజెన్సీ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. నారాయణ పేట జిల్లా మాగనూరు జెడ్పీ స్కూల్ లో నిన్న మధ్యాహ్న భోజనం వికటించి 50 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై సీఎం రేవంత్ సీరియస్ కావడంతో అధికారులు అలర్ట్ అయ్యారు. ఈ విషయమై కలెక్టర్ ను ఆరా తీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిర్లక్ష్యంగా ఉన్న అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. దీంతో ఎంఈఓ, హెడ్ మాస్టర్, భోజన నిర్వహణ ఇన్ చార్జిలను సస్పెండ్ చేసింది.

మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై

# కేసు నమోదు

భూకబ్జా వ్యవహారం

హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ లో కేసు

బాధితులపై దాడి, సెల్ ఫోన్లు కూడా లాక్కున్నారనే ఆరోపణలు



మహబూబాబాద్ : మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్ పై పోలీసు కేసు నమోదైంది. భూకబ్జా వ్యవహారంలో హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేశారు. నగరంలోని వినాయకనగర్ లోని దుర్గాదేవి కాలనీలో 500 గజాల స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించినట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ స్థల యజమానులకు చెందిన కంటైనర్ తో పాటు గృహోపకరణ వస్తువులను కూడా దొంగిలించిన విషయంలో పలు సెక్షన్ల కింద కేసు నమోదయింది. బాధితులపై దాడికి పాల్పడ్డారని, వారి సెల్ ఫోన్లు కూడా లాక్కున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై వరుసగా ఫిర్యాదులు అందుతుండటంతో పోలీసులు ఈ విషయాన్ని సీరియస్ గా తీసుకుని విచారణ చేపట్టారు.

మరోవైపు 2017లో కూడా కేసు నమోదయింది. అప్పటి జిల్లా కలెక్టర్ ప్రీతిమీనాతో అనుచితంగా ప్రవర్తించారంటూ కేసు నమోదు చేశారు. అయితే ఆయనపై మోపిన అభియోగాలు రుజువు కాకపోవడంతో కేసు వీగిపోయింది.